

### ప్రేరణ

సమాజం సాహిత్యానికి ప్రేరణ నిస్తుందని, అలాగే దానికి ప్రతిఫలంగా సాహిత్యం కూడా సమాజంపై ప్రభావం చూపుతుందని గట్టిగా నమ్మేవారిలో నేనూ ఒకణ్ని. కొద్దిగానైనా సరే సమాజచైతన్యానికి దోహదం చేసే రచనలు చేయడమే ఇష్టం. తెలంగాణా సాయుధ పోరాటంనాటి విశేషాలు తెలుసుకుంటున్నప్పుడు వళ్లు గగుర్పొడిచింది. ప్రపంచప్రజల పోరాటాలలో దీనికున్న ప్రాముఖ్యం తెలిసొచ్చింది. ఆనాటి సంఘటనల్ని కొద్దిమంది రచయితలు మాత్రమే, సాహిత్యబద్ధం చేశారు. ఎవరో చెప్పిన ఒక వాస్తవ సంఘటన ఆధారంగా నేనూ ఒక చిన్న ప్రయత్నం చేశాను. అదే ఈ భూమిక.

### నా గురించి నేను


తెలంగాణాప్రజల భాషలో కవిత, కథ చెప్పి, ఒప్పించిన వాడిగా గుర్తింపు ఉంది. 'గుడిసె గుండె', 'కడుపుకోత' సంకలనాలు అందుకు సాక్ష్యాలు! ఇటు జానపద సాహిత్యం, అటు ప్రయో'జన'— సినిమా అభిమాన విషయాలు, సాహిత్య వ్యాసాలు, వైజ్ఞానిక విశేషాలు ప్రచురిస్తూనే, 'బుడుంగు' 'గురువుకు ఎగవామం' వంటి చైనా జానపద పిల్లల కథల్ని అనువదించారు. గజల్స్ నుండి గద్దర్ పాట దాకా అనుభవిస్తారు. మట్టితో, 'మట్టి మనుషుల'తో కలసి తిరుగుతూ 1979 లో నెమటోడ్ వృక్ష పరాన్నజీవుల మీద సిద్ధాంత గ్రంథం రాశారు.

—రచయిత

**తెలంగాణా సాయుధ పోరాటం ఉధృతంగా సాగుతున్న రోజులు. నిజాం సిపాయిలు ఊళ్ళమీద పడి, దోచుకుంటున్న రోజులు. కోళ్ళను, గొర్రెల్ని కోసుకు తిని, కనబడ్డ ఆడదాన్నల్లా చెరిచి ఖుషీ చేస్తున్న రోజులు. ప్రపంచానికి చీకటి — పాలు ఇస్తున్న రోజులు. ప్రపంచాన్నే చీకటి పాలిస్తున్న రోజులు. చీకటి రాజ్యంలో అతి భయంకర కంఠ స్వరాల ఉరుములు. హీనుల బలహీనుల రోదనలు. అందమైన ఆడవాళ్ళ గళాలలో ఆర్తనాదపు జీరలు. లోకుల్ని కాల్చుకు తింటున్న తుపాకులు, సైనిక పిశాచాలు!!**

వీధుల్లో వాహనాలు తిరగడం లేదు. క్రిమి కీటకాలు సైతం బయటికి రావడానికి భయపడుతున్నాయి. చీమల బారులా సైనికులు నగరాన్నంతా దోచేస్తున్నారు. క్రూరత్వంతో ముంచేస్తున్నారు. డబ్బూ, విలువైన వస్తువులు, ప్రాణాలు, స్త్రీల మానాలు, అందాలు, ఆనందాలు, పూల పుప్పొడి తనం, ముళ్ళ వాడితనం, కలిసికట్టుగా దోపిడీ చేయబడుతున్నాయి. గాయాలు తగిలిన వారు రక్తం కారుతూ వుండగా పరుగెత్తుతున్నారు. వాళ్ళను మళ్ళీ వాళ్ళ రక్తపు అడుగులే పట్టిస్తున్నాయి. ఊపిర్లు పగిలి పోతున్నాయి. రోడ్ల మీద ఎన్నో శవాలు! వాటి పై నుండే పోలీసువ్యాన్లు. మట్టి, మాంసం, రక్తం అంతా కలిసి బురద...బురద... తెలంగాణా అంతటా నిజాం వ్యతిరేకోద్యమం బలం పుంజుకుంది. విముక్తి ప్రజాసైన్యం మరింత చైతన్య వంతమైంది. హైద్రాబాద్ మహానగరంలో గన్ ఫౌండ్రీ వద్ద నిజాంపై బాంబు విసిరి వేయబడింది. ఆయనకు ప్రమాదం కొద్దిలో తప్పింది. బాంబు విసిరివేసిన వారెవరూ వెంటనే దొరకలేదు. ఆ సంఘటనతో నగరమంతా అట్టుడికినట్టు ఉడికింది. బందోబస్తు ఎక్కువైంది. ఆ పెద్దబంగళాలో ప్రముఖ నటి శ్యామల ఒంటరిది. ఆందోళనల మధ్య, ఆవేశాల మధ్య, ప్రాణం కొట్టుకు లాడుతుండగా ఆమె నిస్సహాయంగా వుంది. ఆ పెద్ద బంగళాలో ఆమెది మరీ పెద్ద గది. పూర్తి ప్రశాంతంగా వుండేది. నీలిరంగు బల్బు వెదజల్లే వెలుగులో చల్లదనం వుందనిపించేది. సీలింగ్ ఫ్యాన్ మెల్లిగా తిరుగుతూ హాయినిచ్చేది. కాని ఆ రాత్రి అందుకు పూర్తి విరుద్ధంగా వుంది. బయట తుపాకి దెబ్బలకూ, ఆక్రోశాలకు మధ్య స్వైర విహారం చేస్తున్న నిశ్శబ్దంలో శ్యామలకు పిచ్చెక్కినట్లయ్యింది. ఆమెకొచ్చిన అవార్డ్సూ, మెడల్సూ, ముఖ్యమైన వాళ్ళతో కలిసినప్పుడు తీసిన ఫోటోలు అన్నీ చూసుకుంది. వాటితో ఇక రుణం తీరినట్లే! ఆమె శ్వాస — ఆమెకెన్నో బహుమతులిచ్చింది. ముఖ్యంగా 'ప్రముఖ నటి' అన్న గుర్తింపు నిచ్చింది. మరి రాబోయే మృత్యువేమిస్తుంది? జీవితానికి ఫుల్ స్టాప్ పెడుతుంది. ప్రేక్షకులకు ఆమెనుగూర్చిన జ్ఞాపకాలను పంచుతుంది. మంచి పెద్దల్ని ఎంచుతుంది.

ఆమె కూతురు అరుణ. తను కేవలం బిజీ స్టార్‌నే కాకుండా డాక్టర్ కె.రామారావుతో హాయిగా సంసారం వెళ్ళబుచ్చుతున్నానని రుజువు చేయడానికి పుట్టింది. ఆ చిన్నపిల్ల అప్పుడప్పుడు ఏడుస్తుంది, తల్లి ఒంటరితనాన్ని పోగొట్టడానికి! మాతృత్వాన్ని తాగడానికి!! భర్తకూడా ఆసమయంలో వెంట లేకపోవడం



ఆమె ఒంటరితనానికి విషమ పరీక్ష అయ్యింది. మెయిన్ డోర్ ఎవరో బాదుతున్నారు. దబదబ శబ్దం గుండెలో చావుడప్పులా వుంది! గుండెలో మసలిన రక్తం మెదడు కెక్కుతోంది. మెదడంతా అయోమయంగా వుంది. నౌకర్లు, చాకర్లు అందరూ ఎవరెవరు ఎక్కడికి పారిపోయారో తెలియదు. ఎంత చెప్పినా సమయానికి ఒక్కరూ లేరు. చెమటలూ భయం!! భయంకరమైన

# దేవరాజు మహారాజు



# భూమిక

రచయిత చిరునామా
1-8-455
చిక్కడపల్లి
హైద్రాబాదు—500 020

రా త్రిలో ప్రమాదకరమైన పరిస్థితుల్లో తను ఒంటరిగా విక్కుకు పోయినట్లు అనిపించిందామెకు. తలుపు బాదడం ఎక్కువైంది. 'ఎవరూ?' అని అడిగే ధైర్యం కూడా లేదు.

''ఏయ్ దర్వాజా ఖోల్''— బజారంతా దద్దరిల్లేట్లు క్రూరమైన నవ్వు వినిపించింది. విరిగిపోయేంతగా తలుపుల్ని తన్నుతున్న చప్పుడు... ఇక లాభం లేదు. ఇత్తె హోదుల్ గూండాలు ఇంట్లో జొరబడి, అల్లరి పెట్టి, చివరకు చంపేస్తారు. రోజూ 'మీజాన్' పత్రికలో చదివే వార్తలకే భయపడి పోయేదామె. ఇప్పుడిక ఎదుర్కోవాలంటే ఎంత ధైర్యం కావాలి? భయపడుతూనే తలుపుతీసింది. చనిపోతానని అనుకునే తలుపు తీసింది.





ఖాసిం నిలబడి వున్నాడు.

అతని వెంట చాలామంది జవాన్లున్నారు. వారి దగ్గర తుపాకులు, బ్రెన్ గన్‌లూ వున్నాయి. అందరూ లోనికొచ్చారు. సారాకంపు గుప్పున ఇల్లంతా వ్యాపించింది. వైభవంగా వున్న ఇల్లు, ధరగల వస్తువులు చూసి జవాన్లు నిగ్రహించుకోలేక పోతున్నారు. లూట్ చెయ్యడానికి సిద్ధంగా వున్నారు ద్రాక్షపళ్ళ కాశపడ్డ నక్కల్లా. కాని తమ సర్దార్ హుకుం జారీ చెయ్యందే వారేమీ చెయ్యరు. వారినీ, వారి మనసుల్నీ ఏమాత్రం చదవడం లేదు ఖాసిం. అదని దృష్టంతా శ్యామల మీదే వుంది. అతడూహించనంత అందం ఆమెలో కనిపించిందతనికి. ఆవాతావరణం చూడగానే సర్దార్‌కు కొంచెం విశ్రాంతి తీసుకోవాలనిపించింది. దోపిడీలు, ఖూనీలు విరామమెరుగక చేయడంవల్ల శరీరం అలసిపోయింది. మనసు మెత్తబడింది. చెయ్యాల్సిన పని కాసేపు సరదాగా ఆడుకుని , మరీ చెయ్యొచ్చు నన్న ఆలోచన కలిగింది.

"సుభానల్లా! ఏమి అదృష్టం నాది..." ఆమెలోకి చూపుల్ని గుచ్చుతూ అన్నాడు. అర నిముషం గడిచింది. ఏదో జ్ఞప్తికి వచ్చిన వాడిలా "హుస్సేన్" అని కేకేశాడు. గుంపులో నుండి ఒకతను ముందు కొచ్చి శాల్యూట్ చేశాడు.

" నాచ్‌నే వాలీ ఔరత్ యహీ హైక్యా"

"జీ.హో.. నర్తకికాదు సాబ్ గొప్పనటి! ఈమె భర్త ఈదేశంలో లేదు. విలాయల్ వెళ్ళాడు. "

"ఉంటే ఏముంది? లేకుంటే ఏముంది? మాకు మాత్రం బాగా వుంది." రసికతతో అన్నాననుకొన్నాడు ఖాసిం. శ్యామల తెలివిగలది. పైగా మంచి నటి. అతనిలోని బలహీనతను పసిగట్టింది. దానితోనే అతణ్ణి కట్టి పడేయాలనుకుంది. ఆమెలోని కళాకారిణి మేల్కొంది. భయపడుతున్నట్లు ఏమాత్రం కనిపించలేదు.

" తుమ్‌లోగ్ జావ్. ఫిర్ కాంప్ మే మిలేంగే. వీళ్ళందర్నీ మన జాగాకు తీస్కుపో. ఎక్కడైనా పాగల్ పనీ మాయించారో జాగ్రత్త!"— చండశాసనుడు గర్జించాడు.

"అచ్ఛా" శాల్యూట్ చేశాడు హుస్సేన్. తదనుగుణంగా మిగతా సిపాయిలూ చేశారు.అందరూ వెళ్ళిపోయారు. మెయిన్ డోర్ బోల్ట్ పెట్టేసి వచ్చాడు ఖాసిం. ఆమె చిన్నగా నవ్వింది. అక్కడతనికి స్వర్గం కనిపించింది. ఒకసారి ఆమెను గట్టిగా ముద్దు పెట్టుకోవాలనుకున్నాడు. ఆమెవైపు వంగాడు. "ఓ—నో— డోంట్" అంటూ ఆమె గొంతు లేదు. మారం చేయలేదు. ఫౌంటెన్ నీటిని పైగి ఎగజిమ్మినట్లు పదాల్ని బరువుగా మత్తుగా చిలికింది. ఆమె కలికితనం పలికింది. పరవశుడయ్యాడు— సర్దార్. "నువ్వు — జంకవు.." ఏదో అనబోయాడు. చల్లగాలిలా నవ్వింది. "నీకు చాలా బింకము"— మల్లెమొగ్గలా నవ్వింది.


" నీపేరు... ఏమి?" మీసాలు మెలేస్తూ అడిగాడు. ఆమె సోగకళ్లు మరింత అందంగా తిప్పి, బుగ్గ మీద చక్కని సొట్టపడినప్పుడు అంది."షబాబ్"

"షబాబ్?"— ఆశ్చర్యపడ్డాడు. "తెలుగులో మీకర్థం కాదుకదా! ఉర్దూలో నాపేరుకు అర్థం అదే అనుకుంటాను."— ఆమెకు తెలుసు ఆమె అబద్ధం చెప్తోందని. అబద్ధాలతోనే అతణ్ణి నమ్మించాలని—

"ఓహో— షరాబీ — మాంధి పేరు" ఆమెకేదో ఆలోచన వచ్చింది. "మీకు షరాబ్ ఇష్టమా?"— అని అడిగింది. "హా— అవును! మువ్వెంత ఇష్టమో అంతే!"

"క్షమించండి. పాప లేచింది. ఇప్పుడే పడుకోబెట్టి ఐదునిముషాల్లో వస్తా. అంతలోకి మీరు విశ్రాంతి తీసుకోండి. తర్వాత నేను మీకూ..." మాట పూర్తి కాకుండానే సంతోషంతో నవ్వాడు, సర్దార్ ఖాసిం.

"అదిగో షల్ఫ్‌లో బ్రాందీ బాటిల్స్ వున్నాయి. ఈపక్కనే ఫ్రిజిడేర్‌లో బీర్, కోల్డ్ వాటర్ వున్నాయి. విస్కీకూడా వుంది. ఎంజాయ్ ద డ్రింక్స్" మహదానందమైందతనికి! కోరిక చెలరేగింది. ఒక్కసారిగా కావల్సిన బాటిల్స్ అన్నీ తీసుకుని, సోఫాలో కూలబడి ముందుంచుకున్నాడు.




"జల్దీ రావాలె! నీకు హానిచెయ్యం.కొంచెం ఖుషీ చేసి పోతాం అంతే"— సరే నన్నట్లు మెల్లిగా తల కదిలించి, గమ్మత్తుగా కళ్ళు మూసి, తెరచి , నిశ్శబ్దంగా నవ్వి — అక్కడినుండి గబగబా లోని కెళ్ళిపోయింది. అతని చూపులు ఆమెనే అంటుకున్నాయి. చిలిపిగా నవ్వుకున్నాడు.

రిఫ్రిజిరేటర్లో కావల్సిన వన్నీ ఉన్నాయి. గబగబా రెండు పెగ్‌లు తాగి, సిగరెట్ అంటిస్తే చాలాహాయిగా, ప్రశాంతంగా అనిపించింది— మనసుకు. మధ్యలో ఓసారి శ్యామల హాల్లోకి వచ్చి ఏదో తీసుకెళ్ళింది. అతనికది అనవసరం. ఆమె నవ్వింది అంతే— మరో పెగ్ ఆమెవైపు ఎత్తి, మళ్ళీ తాగాడు. మత్తు— కళ్ళను కమ్ముతోంది. చుట్టూ గోడలకు వున్న పెయింటింగ్స్ ఏవేవో తెలియడంలేదు. ఒకచోట మాత్రం శ్యామల ఆమె భర్తతో కలిసి, పెళ్లయిన కొత్తలో తీయించుకున్న ఫోటో వుంది. అతనికి ఫోటో అంతా కనిపించటం లేదు.శ్యామలను గుర్తుపట్టాడు. ఆమె అతణ్ణే చూసి నవ్వుతున్నట్టు అనుభూతి చెందాడు. ఫోటోలోని శ్యామలకు చూయిస్తూ మరోపెగ్... తరువాత మరో పెగ్. లేచి ఇల్లంతా తిరగాలనుకున్నాడు. కాని లేవలేక పోయాడు. అలా వుంటేనే సుఖంగా వుందనిపిం చింది. ఖాళీసీసా సోఫాకిందికి జారింది.

తనకిష్టమైన గజల్ ఏదో తడబాటు పదాలతో నోరు వంకరగా పెట్టి, గొణుక్కున్నాడు. అతణ్ణే అవతలి గదిలో నుండి గమనిస్తూవున్న శ్యామల "హమ్మయ్య" అని అనుకుంది. దగ్గరికెళ్ళి తల నిమిరింది. ముద్దుముద్దుగా మాటలు చెప్పింది. షర్టు గుండీలు విప్పి, ఛాతి అంతా సుతారంగా రాసింది. మెల్లిగా మత్తుమందు... తాగించింది. పరస్త్రీ తనను అంత బాగా ఆదరించడం అప్పుడే చూశాడు. ఆ సంతోషంలో ఏదేదో వాగాడు. కాని, ఆమెకు వినాల్సిన అవసరం లేదనిపించింది. కోర లూడదీసి, విషం లాగేసి , సర్పాన్ని పట్టుకున్నట్లు— విజయగర్వంతో ఉప్పొంగిందామె.

అతను ఇంట్లోకి రాగానే ఎంత భయమైంది? ఎలా తప్పించుకోవాలో అర్థంకాలేదు. ఆమెకు బాగా చేతనైన పని నటన. దానితోనే మోసగించాలన్న ఆలోచన వచ్చింది. అట్లని నటిస్తున్నట్టుకూడా తెలియకూడదు!

అంతలోకే భయమైంది. జీవితానికి నటనకు గల భేదం ఆ క్షణం బాగా అర్థమైంది. ఎంతో బాధ్యతాయుతంగా నిర్వహించాల్సిన భూమిక కళ్లలో మెదిలింది. సైనికులు రాగానే అతిధుల్ని ఆహ్వానిస్తున్నట్లు ఆవందంతో నవ్వింది. అంతే—ఆ నవ్వు భయంకరమైన అరుపుల్నీ, బీభత్సాన్నీ, దోపిడీని అపగలుగుతుందని వూహించలేక పోయింది. కాని, ఆత్మస్థైర్యంతో ప్రయత్నించి ఎదుర్కోవడం వల్ల, ఆమెకెంతో సంతృప్తిగా వుంది. ఖాసింస్థితి పూర్తిగా విషమించింది. గొణుక్కోవడం కూడా మానేసి సోఫాపై పడిపోయాడు. పగిలిన గ్లాసు గాజుముక్కల్ని యేరి పారేసి, లేవలేని స్థితిలో వున్న సర్దార్‌ను సోఫా కుర్చీనుండి బలవంతంగా

లాగి మరోరూంలోకి నడిపించుకెళ్ళింది. అతణ్ణి అక్కడే పడేసి, తలుపు గట్టిగా పెట్టి గడియ వేసుకుంది.

మళ్ళీ శబ్దమైంది. ఆమె అదిరిపడింది. కాని ఆ చప్పుడు తలుపుది కాదు. గడియారానిది! సమయం రాత్రి పన్నెండయ్యింది. వాతావరణం భయం భయంగా వుంది. కొంతసేపు కూతురు అరుణను జోకొడుతూ గడిపింది. నిద్ర రావడం లేదు. ఆప్తాలమిక్ సర్జరీలో నైపుణ్యం సంపాదించడానికి ఇంగ్లండ్ వెళ్ళిన భర్త గురించి ఆలోచించింది. ఆయన క్షేమంగా తిరిగి రాగలడా? కలిసి మళ్ళీ ఒకచోట సుఖంగా బతకగలమా? అనుమానాలు తలెత్తాయి? పరిస్థితులు చక్కబడి మళ్ళీ తను నటించే అవకాశాలు వస్తాయా? ప్రేక్షకుల అభిమానం మళ్ళీ తనను ఉన్నత శిఖరాల మీద కూర్చోబెడుతుందా? ఇక్కడి వాళ్ళంతా ఆంధ్ర ప్రాంతానికి పోయి తలదాచుకుంటుంటే, తను అనవసరంగా ఇక్కడి కొచ్చి ఇరుకున పడిందా? తనలో తనకే ఎన్నో ప్రశ్నలు.

నిరాశతో వీధిలోకి చూస్తూ గడిపింది. నిశ్శబ్దాన్ని ముక్కలు చేస్తున్నట్లు అప్పుడప్పుడు గుర్రపు డెక్కల చప్పుడు వినిపిస్తోంది. మళ్ళీ తలుపు బాదిన చప్పుడు... రెండునిముషాలు గడిచాయి. ఈసారి ఎవరొచ్చారో, మళ్ళీ ఎలాంటి భూమిక ధరించాలో అర్థం కాలేదు. ఈసారి వచ్చిన వాళ్ళు తనను, తనబిడ్డను కాల్చెయ్యరని నమ్మకమేమిటి? కళ్ళలో 'భయం' నీళ్ళుగా మారింది. తలుపు చప్పుడు—తన ఓపికను, నటనా సామర్థ్యాన్ని పరీక్షించడానికే; తనను అధఃపాతాళానికి తొక్కెయ్యడానికే అన్నట్లుంది. గుమ్మందాకా వెళ్ళి నుంచుంది.

"తలుపు తెరవకుంటే ఇల్లు కాలిపోతుంది జాగ్రత్త!" ఉర్దూలో బెదిరింపు. బాధలు,భయాలు కలిపి ఆమె మరో కొత్తనవ్వు నవ్వుతూ తలుపు తెరిచింది. తలుపు తెరవగానే కనబడినవాళ్లను అమాంతం కొరికేద్దామనుకున్నాడు హుస్సేన్. కాని ఆమే తలుపుతెరిచి నిలబడడంతో నిప్పుకు దగ్గరైన వెన్నలా కరిగి పొయ్యాడు. ఆమె తెల్లని శరీరం... ముఖం మీద పడుతున్న నల్లని వెంట్రుకలు, నిద్రకై వేచివేచి వాచిపోయిన కళ్ళు; నున్నటి బుగ్గలు వింత అందాన్ని అందించాయి అతనికి అలాగే మాపుల్ని కిందికిజార్చి ఆగాడు.

"భలే నిద్ర పట్టేసింది"—అంటూ ఆమె అనవసరంగా నవ్వింది. అతడు గబుక్కున లోని కొచ్చి తలుపు వేశాడు.

"ఒంటరిగా వున్నావని భయపడకు! అల్లా మియా మీద ఒట్టు. నీ ప్రాణం తీయను. బుద్ధిగా నేను చెప్పినట్లు చెయ్." ఆమె నవ్వుఅస్త్రం ప్రయోగించింది. అతడు చిక్కున పడ్డాడు. ఆమె నవ్వులో గొప్ప ఆకర్షణ వుంది.

"క్యాహుస్న హై... తెరీ"—తనలో తానే అనుకున్నాడు. "గుమ్మందగ్గరే షాహిరీ చెప్పేస్తున్నారే— లోన హాల్లోకి రాకూడదా?" —అంది శ్యామల. తనదే పొరపాటన్నట్లు ముఖంపెట్టి లోనికి నడిచాడు. ఆ గది దాటి లోన సోఫా దగ్గరిదాకా వచ్చాడు.

"డ్రింక్స్ రడీగా వున్నాయే"

"తాగుతారా? తీసుకొండి"

"నై—నై—బహుత్ షుక్రియా.బస్. తుమ్ ..." మధ్యలో అర్ధవంతంగా ఆగాడు.

"ఊ—మై"—కళ్ళు వింతగా తిప్పిందామె.

"తుమ్ కో ఫీన్ లూంగా నహీ—

తుఝె జైసా హీరా కహీ ఖజానా మే నహీ—" పూర్తికాకుండానే పకపకా నవ్వింది శ్యామల." అమ్మాయిల్ని వర్ణించడం మీకు బాగా వచ్చు"

"అమ్మాయిలను వర్ణించను. పెళ్ళయిన కొత్తలో ఐసే హీ—" అంటూండగానే కూర్చోమని చెయ్యి పట్టి కూర్చోబెట్టుకుంది, తన పక్కనే —అతని చెయ్యి తన చేతుల్లోకి తీసుకుంది.

"అసలు విషయం పక్కనబెట్టి ఖాలీ మాటలకు దింపుతాన్నావ్—చలో...చలో. మేరాకామ్ జల్దీ కరో. జానేకా హై"

"అరే—ఆప్ క్యా ఇత్ నా ఢర్ తేహై. మీ ఆఫీసరు కూడా ఎవరింట్లోనో ఇలాగే దూరివుంటాడు..."

"ఎవరింట్లోనో ఎందుకూ? మీఇంట్లోనే దూరిమమ్మల్ని వెళ్ళిపొమ్మన్నాడు. ఆవెళ్ళిన వాళ్ళలో నేనూ ఉన్నాను. వెళ్ళానుగానీ, నామనసంతా ఇక్కడే వుంది. ఎంత అందంగా వున్నావ్..." ఉర్దూలో అతని మాటలు కవిత్వపరంగా కొనసాగాయి. అతనికి గట్టిగా ఏదో చెయ్యాలని తపన. కాని ఆమె చనువుగా దగ్గరికొస్తూ వుంటే బలవంతం చేయడమెలా? బుజ్జగిస్తున్నాడు. ఆమె నవ్వుతో వెలుగుతోంది. వెలుగులో అతను కీటకంలా కాలి పోతున్నాడు.

"యు ఆర్ సో హేండ్సమ్"—తీయగా అంది సాగదీసి. ఆనందం పరిధులు దాటింది హుస్సేన్ కు. మళ్ళీ అడిగింది.

"వయసు మళ్ళినాక పెళ్ళి చేసుకున్నారేమిటి?" —ఆమె కూడా వీలైనంత వరకు ఉర్దూలోనే మాట్లాడుతోంది.

"అబ్బే లేదు. చేసుకుని ఇరవై అయిదేళ్ళయ్యింది. నాపిల్లలకు పిల్లలు గూడా" బొలబొలా నవ్వాడు.

"మీపిల్లలా?—నావయసుంటుందా వాళ్ళకు?"

"పెద్దది హసీనా. నీవయసుండొచ్చు. చిన్నది, షబానా నీకన్నా చాలా చిన్నదై వుంటుంది"

"చాలా అందంగా వుంటారా వాళ్ళు?"— అందంగా ముఖంతిప్పి అడిగింది.

"అవును"—చిరునవ్వు నవ్వాడు.

"అందగత్తెల జాబితాలోకే వస్తారు నీలాగా"— అన్నాడు. ఆమెకళ్ళు మూసుకుని, అతని భుజంపై చెయ్యివేసి మగతగా అడిగింది. "మీకు మీరుపుట్టిన వూరన్నా, మీకుటుంబమన్నా చాలా ఇష్టం కదూ"

"ఆ— బేషక్! ఎవరి కుండదుగనక? ప్రశ్నార్థకంగా చూశాడు.

"అప్పుడప్పుడు కుటుంబానికి దూరంగా వెళ్ళవల్సి వస్తోంది కదూ! పాపం—"


"అవును. ఉద్యోగమలాంటిది. తప్పనిసరిగా నా భార్యాబిడ్డలకు దూరంగా గడపాల్సి వస్తుంది." మెత్తదనం చోటు చేసుకుంది గొంతులో.

"పరాయివాళ్ల మీయింట్లో జొరబడి, దోపిడి చేసి, నావయసులో వున్న మీ కూతురు హసీనాను అనుభవిస్తే మీకేమనిపిస్తుంది.?"

"ఏయ్—ఖామోష్"—ఆవేశపూరితంగా అరిచి, దిగ్గున లేచాడు. "వళ్ళుదగ్గర పెట్టుకుని మాట్లాడు. నాకూతుర్ని చెడ్డదృష్టితో చూసిన వాడి కళ్ళు పీకేస్తాను. కుటుంబ గౌరవం కోసం ప్రాణాలు పోయినా సరే పోరాడుతాను."—ఆమె అలాంటి ప్రశ్న వేస్తుందనుకోలేదు. కోపంగా, క్రోధంగా చూశాడామె వైపు. ఆ ఒక్కప్రశ్నకు సమాధానం చెప్పలేక అలసిపొయ్యాడు. బరువుగా శ్వాస వదిలాడు— ఆమె క్షమించమన్నట్లుగా చూసింది.

"మీరుంటే అలాగే చేస్తారు. నాకా నమ్మకముంది. మీరు వూళ్లో లేనప్పుడు...ఒకవేళ...అలా జరిగితే—"

హుస్సేన్ ఆలోచనలో పడ్డాడు. ఆలోచిస్తున్న కొద్దీ తనపై తనకే కసి పెరుగుతోంది.



"మై మాఫీ మాంగ్‌తా హూ— నాకనవసరమైన విషయాలు మాట్లాడాను. మీపని ముగించుకుని వెళ్ళండి. కొద్దిసేపయితే మళ్ళీ పాప లేస్తుంది. మై తయ్యార్ హూ. అన్నట్టు మీ కూతురు హసీనా నా వయసుదేకదూ! ఆమె అందం నాకొస్తుందా గాని, కొంచెంసేపు హసీనా అనే అనుకోండి. ఆయియే సాబ్— ఆయియె. మీ హసీనాను....." —తను నటిస్తున్నప్పుడు ముఖ కవళికలన్నీ మార్చి ఎంతో ఉత్తేజంతో చెప్పే, డైలాగుల్లా చెప్పింది — మహానటి శ్యామల.

అతడన్నీ విన్నాడు. మౌనాన్ని మింగాడు. మెదడు వేడెక్కింది. కర్కశత్వం, నీచత్వం ఆవిరై పోయాయి. ఒకవైపు క్రోధం, మరోవైపు అసహాయత...

"మీ ఆఫీసర్ను చూస్తారా?" — నెమ్మదిగా అడిగింది శ్యామల.

సోఫాలో అటు తిరిగి, తలవంచి ఆలోచిస్తున్న వాడల్లా ఆశ్చర్యపోయి "ఆ..సీ..స..ర్‌ఎవరూ?"

"మీరెవరి అడుగు జాడల్లో నడుస్తున్నారో అతను!!" హుస్సేన్‌ను స్వయంగా లేపి, తీసుకెళ్ళి రూంలో వేసిన సర్దార్ ఖాసింను చూపించింది.

"చచ్చిపోయాడా!" భయం. ఆశ్చర్యం. అతని గొంతులోని బలహీనతను పసికట్టి ధైర్యంగా నిజం చెప్పింది.

"లేదు—తాగిన మైకం. ఇంకో నాలుగు గంటల వరకూ లేవడు. ఒంటరిదాన్ని. నన్ను నేను రక్షించుకునే మార్గం మరోటి తోచలేదు. లొంగినట్టే నటించాను. మత్తుమందు తాగించి మోసం చేశాను"

అతడు వింటున్నాడో లేదో గాని, దుఃఖాన్నంతా ముఖమ్మీద పరుచుకున్నాడు. చేతుల్తో కళ్ళు మూసుకుని అన్నాడు—"కళ్ళు తెరుచుకున్నాయ్"

అక్కడే చాలాసేపు నిలబడ్డాడు. బేబిలేచిన చప్పుడు వినిపించి శ్యామల పరుగెత్తింది. ఖాసింను ఆస్థితిలో చూసి ఏవగించుకున్నాడు హుస్సేన్. అసలు వచ్చిందైతే ఖాసిమ్‌సాబ్ వెళ్ళిపోయి వుంటాడనుకుని! కాని మత్తుమందుతో మోసగింపబడి, స్పృహలేకుండా పడి వుంటాడనుకోలేదు. పులిలాంటి వాడు, ఒకచిన్న బలహీనతకు ఎలా చొళ్ళు కార్చుకుంటున్నాడు?—?—? ఒంటరిది గనక సులభంగా చేజిక్కించుకోవచ్చు ననుకున్నాడు. కాని ఆమె అలాంటిది కాదని, తెలివి గలదని తెలియగానే ఎందుకో సదభిప్రాయం కలిగింది. తల భారంగా అనిపించింది. చార్మినార్ సిగరెట్ వెలిగించాడు. మెల్లిగా వెనక్కి కదిలాడు హుస్సేన్.

మధ్య హాల్లోకి నడిచే సరికి—

నటి శ్యామల— తనకూతురుకు పాలిస్తోంది. ఆ దృశ్యం కళ్ళారా చూడలేక పోయాడు. ఏదో వ్యథ గుండెను కెళ్ళగించింది.

అదే దృశ్యం—తల్లిపాలు కుడుపుతున్న దృశ్యం.... కళ్ళుమూసుకున్నా కనిపిస్తోంది.

రాజూ, రాజ్యాధికారులూ తల్లి లాంటివారే. ప్రజల్ని రక్షించాలి. భక్షించ గూడదు. ఎంత పాపం చెయ్యడానికొచ్చాడు తను? తనను అల్లా క్షమించడు. ఈ నీచత్వానికి శిక్ష జరుగుతుంది.

"మాఫ్ కర్ దేనా బేటి! హిజ్ ఎక్సలెన్సీ హుకుం ప్రకారం దోపిడి, లూటీ, మానభంగాలు, ప్రాణాపహరణాలు చేస్తున్న మాకు వివేచన లేకుండా పోయింది. మా మీదనుండి ఎప్పుడో కాలం కసిగా కాటేసి వెళ్తుంది. అసలైతే ఇలాంటివాటికి నేను చాలా దూరం. కాని తోటివారి సాహచర్యంవల్ల, నాకేదో పిచ్చి బుద్ధి పుట్టింది..." —చాలా వెబుతున్నాడు హుస్సేన్.

నటిశ్యామలకు తన నటన పై గొప్పనమ్మకం కలుగుతోంది. అంతకుముందు లక్షలమంది ప్రేక్షకులు పొగడితే కలిగిన సంతృప్తి కన్నా, ఇప్పటి సంతృప్తి ఆమెకు అనేక రెట్లు అధికం! నిజజీవితంలోకూడా ఒక కొత్త పాత్రను ధైర్యంగా నిర్వహించి తనను, తన కూతురును రక్షించుకుంది. తన నటనకు సార్థకత చేకూరింది.

నిశ్శబ్దం బరువుగా ఘనీభవించింది— కొంతసేపు.

"అమ్మాయ్—అమ్మాయికి పాలివ్వడం అయ్యిందా?" —ఆమెకు ముఖం చూపలేక, మరో వైపు తిరిగి అడిగాడు.

"ఆ—అయిపోవచ్చింది"

"అయితే త్వరగా నడువ్. బయట జీప్ వుంది. వీలైనంత త్వరగా నిన్ను సురక్షిత ప్రాంతానికి చేరుస్తాను. అట్లా చెయ్యడం నా ఉద్యోగధర్మం కాదు—కాని, అలా చేయమని నా మనసు చెప్తోంది. ఇక్కడుంటే నీజీవితం నీదికాదు. ఖాసిమ్ సాబ్‌ను వెదుకుతూ కొద్ది సేపట్లో చాలా మంది రావొచ్చు." —జరగబోయే బీభత్సం కళ్ళలో మెదిలింది హుస్సేన్‌కు.

ఆమె కళ్ళు ఆనందంతో నవ్వాయి. తన భూమిక ముగిసినట్లనిపించింది. బయట—అధికారం అరుస్తోంది. అసహాయత ఏడుస్తోంది. పెద్దగోల. నిశ్శబ్దం ఉరి పోసుకుంది. ప్రపంచానికి చీకటిపాలు—ఇస్తోంది.

ఆమె తన పాపకు పాలివ్వడం పూర్తవుతోంది. ✱


## మీ'మాంస'ప్రియుడు

వన్యమృగ సంరక్షణాధికారి సంహోల్రావుకు మాంసమంటే భలే ఇష్టం. కానీ అందరి ఎదుటా మాంసమంటే ఇష్టం లేనట్టు ప్రకటిస్తుంటాడు. అందులోనూ వేటమాంసమంటే అతనికి భలే ఇష్టమని తెల్సిన అతని మిత్రుడు జాంబవంతరావుఓరోజు లేడిమాంసం తెచ్చి అతనికిచ్చాడు.

"బలేబాగుంది..మంచిగుంది.. లేడిని నువ్వు గాని వేటాడలేదుగదా" అనుమానంగా ప్రశ్నించాడు ఉద్యోగానికి ఎక్కడ దెబ్బొస్తుందోనని,

లేదు. అడవికెళ్తే నన్ను పిల్చి అదే దొరికిపోయింది" కోత కోశాడు జాంబవంతుడు.

"అలా దొరికిన జంతువులు అరుదుగా ఉంటాయి.. అలాటి వాటిని విడవద్దు..." గట్టిగా చెప్పాడు సింహోల్రావు. —దాట్ల






everest/85/BCL/311